సాక్షి పల్నాడు

మంగళవారం । 12 । నవంబర్ । 2024




ఆలయ నిర్మాణానికి విరాళం

నరసరావుపేటరూరల్: ఇస్సప్పాలెం శ్రీ మహంకాళి అమ్మవారి దేవస్థానం పునర్నిర్మాణానికి పీవీఎన్ విజయకుమార్, లక్ష్మీమాధురి దంపతులు రూ.1,01,116 విరాళం అందజేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ కృష్ణానదీ పరివాహక ప్రాంతాల నుంచి 290 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 6000 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 587.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10,120 క్యూసెక్కులు వదిలారు.

న్యూస్‌రీల్

అబుల్ కలామ్ ఆజాద్‌కు ఘననివాళి



నరసరావుపేట: స్వాతంత్ర్య సమరయోధులు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి, భారతరత్న డాక్టర్ మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ 137వ జయంతి వేడుకలను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. మౌలానా చిత్రపటం వద్ద కలెక్టర్ పి.అరుణ్‌బాబుతోపాటు పలువురు జిల్లా అధికారులు ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వకృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైనార్టీశాఖ, ఇతర జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెళ్లి కుమారుడైన పాండురంగస్వామి



అమరావతి: ప్రఖ్యాత శైవక్షేత్రం అమరావతిలో వేంచేసియున్న శ్రీరుక్మాభాయి సమేత పాండురంగస్వామి దేవాలయంలో పాంచాహ్నిక కల్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం స్వామివారిని పెండ్లికుమారుని చేసి అర్చకులు ధ్వజారోహణ వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు పరాశరం రామకృష్ణమాచార్యులు ఉత్సవాల గురించి వివరించారు. మంగళవారం చిన్న శేషవాహనం, బుధవారం ఉదయం దధిమథనోత్సవం, గోపాల బాలోత్సవం, గురువారం అశ్వవాహనంపై కల్యాణమూర్తులకు ఎదుర్కోలు మహోత్సవం అనంతరం రుక్మాభాయికి పాండురంగస్వామికి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తామన్నారు. శుక్రవారం కార్తిక పౌర్ణమి రోజున స్వామివారికి లక్ష తులసీపూజ నిర్వహిస్తామన్నారు. శనివారం వసంతోత్సవం, చూర్ణోత్సవం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శివయ్య సేవలో వేణుగోపాలరెడ్డి దంపతులు



పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిశు సంక్షేమశాఖ డైరెక్టర్, ఐఏఎస్ అధికారి వేణుగోపాలరెడ్డి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఉప కమిషనర్ కేబీ శ్రీనివాస్, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం వేణుగోపాలరెడ్డి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారిని స్వామి శేషవస్త్రంతో సత్కరించి వేదపండితులు ఆశీర్వచనం అందించారు. ఉప కమిషనర్ శ్రీనివాస్ స్వామి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

నేడు సుంకం వసూలు హక్కులపై బహిరంగ వేలం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ ఆధీనంలోని రేవుల్లో సుంకం వసూలు చేసుకునే హక్కులపై మంగళవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అచ్చంపేట, మాచవరం, అమరావతి, కొల్లిపర మండలాల్లోని కృష్ణానదీ పరివాహక రేవుల్లో గెజిట్ నిబంధనల మేరకు ఈనెల 12 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు కాలానికి సుంకం వసూలు హక్కులపై ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు సీల్డ్ టెండర్లు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలను జెడ్పీ కార్యాలయం నుంచి పొందాలని తెలిపారు.

గ్రంథాలయ శాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

గుంటూరు ఎడ్యుకేషన్: వావిలాల గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయశాస్త్ర సర్టిఫికెట్ కోర్సుకు (సీఎల్ఐఎస్సీ) దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సంస్థ ప్రిన్సిపాల్ దోనె రాంబాబు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్ పూర్తి చేసి, 18 ఏళ్ల వయసు నిండిన అభ్యర్థులు కోర్సులో చేరేందుకు అర్హులని, ఐదు నెలల కాల వ్యవధిలో తెలుగు. ఆంగ్ల మాధ్యమాల్లో బోధన ఉంటుందని తెలిపారు. 93962 38946 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.

● సోమవారం.. స్వామివారం



ఆరనీకుమా..: రావిచెట్టు వద్ద కార్తిక దీపాలు వెలిగిస్తున్న మహిళలు



ప్రత్యేక అలంకరణలో త్రికోటేశ్వరస్వామి



స్వామి దర్శనానికై : క్యూలైన్‌లో భక్తులు

- కార్తిక సోమవారం త్రికోటేశ్వర స్వామి దర్శనానికి తరలివచ్చిన భక్తులు
- వైభవంగా రుద్రాభిషేకం

నరసరావుపేట రూరల్: పవిత్ర కార్తిక సోమవారం సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండలో భక్తుల రద్దీ నెలకొంది. వేలాది మంది భక్తులు త్రికోటేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాలు, విశేష ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విశేష పుష్పాలంకరణ సేవ జరిపి భక్తులను స్వామి వారి దర్శనానికి అనుమతించారు. ఉచిత దర్శనం క్యూలైన్‌లో భక్తుల రద్దీ అధికంగా కనిపించింది. ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు, మహా నందీశ్వరుడు వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలగించారు. నాగేంద్రుని పుట్ట, ధ్యానశివుని విగ్రహాల వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. నరసరావుపేట, చిలకలూరిపేటల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటుచేసి యాత్రికులను కొండమీదకు చేరవేశారు. రూరల్ సీఐ పి.రామకృష్ణ, ఎస్ఐలు కిశోర్, ప్రియాంకల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఘాట్‌రోడ్డులోని ప్రకృతి పర్యాటక కేంద్రం వద్ద యాత్రికుల సందడి నెలకొంది. ఆలయ ఈఓ డి.చంద్రశేఖర్, దేవాలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

భక్తజన సంద్రం.. అమరారామం

- అమరేశ్వరుడిని దర్శించుకున్న పంచారామాల సందర్శకులు
- కిటకిటలాడిన ఆలయం



విశేషాలంకారంలో అమరేశ్వరుడు



ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అమరావతి: ప్రసిద్ధ శైవ క్షేత్రం అమరావతి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీ బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయం కార్తిక సోమవారం సందర్భంగా వేకువజాము నుంచే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి వచ్చిన పంచారామక్షేత్ర సందర్శన భక్తులతో కిటకిటలాడింది. భక్తులు కృష్ణాజలాలలో కార్తిక స్నానాలు చేసి, ఆలయంలోని ఉసిరిక చెట్టు వద్ద కార్తిక దీపారాధనలు చేశారు. అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీ అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఉదయం సుమారు 70 పైగా బస్సులలో పంచారామ క్షేత్రసందర్శన యాత్రికులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ స్థానాచార్యుడు కౌశిక చంద్రశేఖరశర్మ కార్తిక సోమవారం విశిష్టతను వివరించారు. ఆలయ ఈఓ సునీల్‌కుమార్ అన్నదానం, ఉచిత ప్రసాదం ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామవారిని సుమారు 12వేల మంది భక్తులు దర్శించుకున్నారని దేవాలయ అధికారుల అంచనా. సీఐ ఎం.శ్రీనివాసరావు తన సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

అఘోరీ హల్‌చల్..

మధ్యాహ్నం 12 గంటల సమయంలో అఘోరీ సన్యాసిని అమరేశ్వరా స్నానఘాట్ వద్ద హల్‌చల్ చేసింది. తనకు స్వామివారి దర్శనం కల్పించాలని లేకుంటే కారును కృష్ణానదిలోకి దూకిస్తానని బెదిరించింది. ఈనేపథ్యంలో సీఐ ఎం.శ్రీనివాసరావు తమ సిబ్బందితో వచ్చి అఘోరీ సన్యాసినిని దేవాలయంలోకి తీసుకెళ్లి స్వామివారి, అమ్మవారి దర్శనం కల్పించటంతో పాటు ఎస్కార్ట్‌తో అమరావతి నుంచి సాగనంపారు.



స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లలో ఉన్న భక్తులు

మద్యం దుకాణం తొలగించాలని ఆందోళన



రాజుపాలెం: ఇళ్లమధ్య ఉన్న మద్యం దుకాణాన్ని వెంటనే తొలగించాలని మహిళలు ఆందోళన చేశారు. మండలంలోని కొత్త బోధనం(చౌటపాపాయపాలెం పులిచింతల నిర్వాసితుల కేంద్రం) గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్దకు సోమవారం గ్రామ మహిళలు చేరుకుని పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ మద్యం బాబులు ఇక్కడే తాగి మా ఇళ్లముందే వీరంగం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెల్లవారుజామున 4 గంటల నుంచే మద్యం బాబులు దుకాణం వద్దకు క్యూ కడుతున్నారని, అర్ధరాత్రి 12 గంటల వరకు అక్కడే తిష్టవేస్తున్నారని వాపోయారు. నిత్యం ఈ షాపు ముందునుంచే పాఠశాల పిల్లలు, మహిళలు అధిక సంఖ్యలో వెళుతుంటారని తెలిపారు. షాపు తొలగించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఊరు మధ్యలో ఉన్న దుకాణాన్ని తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

కేజీబీవీలో డిప్యూటీ డీఈఓ విచారణ

చీరాల అర్బన్: మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో సోమవారం చీరాల డివిజన్ డిప్యూటీ డీఈఓ అబ్బరాజు శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఆదివారం ఉదయం విద్యార్థినులకు అల్పాహారం అందించకపోవడంపై పత్రికలలో వచ్చిన కథనాల మేరకు సోమవారం పాఠశాల విద్య ఆర్జేడీ ఆదేశాల మేరకు ఆయన పరిశీలన చేశారు. కేజీబీవీలో ఎస్ఓ, వంట చేసేవారితో మాట్లాడి వివరాలను నమోదు చేశారు. విద్యార్థులకు సరిపడా సిలిండర్లు అందుబాటులో ఉంచకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. ఇంటికి దూరంగా హాస్టల్‌లో ఉంటున్న విద్యార్థినుల పట్ల ఎంతో జాగ్రత్త వహించాలని సూచించారు.

ప్రతి ఫిర్యాదుకూ పరిష్కారం



అర్జీలు స్వీకరించి ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ అరుణ్‌బాబు

- అధికారులకు జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచన
- కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 110 అర్జీలు

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదు పరిష్కారం కావాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ప్రజల నుంచి 110 వినతులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో జిల్లా నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడకి వస్తుంటారని, అటువంటి వారి సమస్యలను సావధానంగా విని, సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యకు నాణ్యమైన పరిష్కారం చూపాలని, ఆ పరిష్కారంతో అర్జీదారు సంతృప్తి చెందాలని అన్నారు. ఇందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీల ద్వారా 104 సర్వీసులు నిర్వహించాలి

మమ్మల్ని ప్రభుత్వ ఆధీనంలోనే ఉంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ద్వారా 104 సర్వీసులను నిర్వహించాలి. పెండింగ్‌లో ఉన్న మూడు నెలల జీతాలు చెల్లించాలి. డ్రైవర్, డీఈఓలకు ఉద్యోగ భద్రత కల్పించండి. వాహనాలకు ఫిట్‌నెస్ ఇన్సూరెన్స్ చేయించండి.

– కోటేశ్వరరావు, అశోక్‌బాబు, నరసింహారావు, ఏపీ 104 ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

రుణాలు సక్రమంగా అందేలా చూడండి



ఎస్సీ కార్పొరేషన్ రుణాలు నిజమైన లబ్ధిదారులకు అందేలా చూడాలి. ఎంపీడీఓలు, సచివాలయ సిబ్బంది రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా రుణాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలి. ఎస్సీ మహిళలకు డ్వాక్రా ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయండి.

– మీరయ్య మాదిగ, సాల్మన్‌రాజు, ప్రభుదేవ, ఎమ్మార్పీఎస్ నాయకులు

గ్రామ సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి



నరసరావుపేట మండలం జొన్నలగడ్డ గ్రామ రెవెన్యూ సర్వేయర్ రీసర్వేలో పొలాలపై సర్వేరాళ్లు పాతిన వ్యవహారంలో అవినీతికి పాల్పడ్డాడని, ఇప్పటికే ఆర్డీఓ, తహసీల్దార్లకు ఫిర్యాదు చేశాం, ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనిపై విచారించి సర్వేయర్‌పై చర్యలు తీసుకోండి.

– నల్లపాటి రామారావు, వై.వెంకటేశ్వర్లు, ప్రజాసంఘాల నాయకులు

రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

- మహిళపై సీఐ థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణం
- సీఐ రమేష్‌పై చర్యలు తీసుకోవాలి
- జగనన్న నాయకత్వంలో దిశ యాప్, దిశ పోలీస్ స్టేషన్‌లు
- రాజకీయ నాయకుల ఒత్తిడికి తలొగ్గుతున్న పోలీస్ శాఖ
- మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని ధ్వజం

లక్ష్మీపురం(గుంటూరు పశ్చిమ): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా యాక్టివిస్టు సుధారాణిని వేధించిన సీఐ తదితరులపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త విడదల రజిని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా సబ్‌జైలులో ఉన్న సుధారాణిని సోమవారం విడదల రజిని, సుధారాణి పిల్లలు, వైఎస్సార్ సీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి నూరి ఫాతిమా, లీగల్‌సెల్ బృందంతో కలిసి పరామర్శించారు. అనంతరం జిల్లా జైలు వద్ద రజిని విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ పాలన చేస్తోందని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో మహిళల రక్షణ కోసం దిశ యాప్‌ను, దిశ పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జరుగుతున్న పరిణామాలను దృష్టిలో పెట్టుకుని చిలకలూరిపేటకు చెందిన సుధారాణి, ఆమె భర్త వెంకటరెడ్డి, ఇద్దరు సంతానంతో తెలంగాణ రాష్ట్రంలోని నల్గొండ సిరిసిల్లలో ఏదో పని చేసుకుంటూ జీవిస్తున్నారని చెప్పారు. సోషల్ మీడియా యాక్టివిస్టు కావడం ఏదో పెద్ద పాపం అన్నట్టు తెలంగాణ రాష్ట్రం నుంచి భార్య, భర్తలను తీసుకు వచ్చి, నాలుగురోజులపాటు పోలీసులు వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. చిలకలూరిపేట టౌన్ సీఐ రమేష్ ఒక మహిళపై థర్డ్ డిగ్రీ ఎలా ప్రయోగిస్తారని ప్రశ్నించారు. సీఐ రమేష్ సుధారాణిపై వినలేని అసభ్య పదజాలం వాడారని విమర్శించారు. సుధారాణి తన ఇద్దరు చిన్నారులు పవన్‌కోటిరెడ్డి, తన్వీతారెడ్డిలను వెంకటరెడ్డి తండ్రి సైదారెడ్డికి అప్పజెప్పే సమయంలో సీఐ రమేష్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడారని ఆవేదన వ్యక్తం చేశారు. సుధారాణికి తామున్నామన్న భరోసా కల్పించామని, ధైర్యంగా ఉండాలని చెప్పామని పేర్కొన్నారు. సుధారాణి పోలీసులు పెట్టిన చిత్రహింసల గురించి చెబుతూ కన్నీరుపెడుతుంటే ఒక సాటి మహిళగా తన హృదయం విలవిల్లాడిందని విచారం వ్యక్తం చేశారు. పోలీసులకు మానవత్వం ఉందా అని ప్రశ్నించారు. హామీలు అమలు చేయని ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో ప్రశ్నిస్తే కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. సుధారాణి పడిన బాధను విన్న న్యాయమూర్తి విచారం వ్యక్తం చేసి వాంగ్మూలం రికార్డు చేశారని పేర్కొన్నారు. నూరి ఫాతిమా మాట్లాడుతూ మహిళలపై చెయ్యి చేసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొన్నారు. సుధారాణిని కొట్టిన సీఐ రమేష్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సోషల్ మీడియా అనేది వైఎస్సార్ సీపీకే కాదు.. తెలుగుదేశం పార్టీకీ ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో లీగల్‌సెల్ నాయకులు పోలూరి వెంకటరెడ్డి, శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పరమ శివుడిని తాకిన సూర్య కిరణాలు

- నాయినపల్లిలోని భోగలింగేశ్వరస్వామి ఆలయంలో దర్శనం
- అధిక సంఖ్యలో వీక్షించిన భక్తులు

వేటపాలెం: నాయినపల్లిలోని గంగాభవానీ సమేత భోగలింగేశ్వరస్వామి దేవస్థానంలో పరమ శివుడ్ని కార్తిక సోమవారం ఉదయాన భానుడి కిరణాలు అభిషేకించాయి. శివుడికి ప్రీతిపాత్రమైన కార్తిక సోమవారం రోజు శివలింగాన్ని సూర్య కిరణాలు తాకడాన్ని భక్తులు అధిక సంఖ్యలో వీక్షించారు. ఆలయ ప్రధాన అర్చకుడు, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు కారంచేటి చంద్రశేఖరరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది దక్షిణాయనం కార్తిక మాసంలో సూర్యకిరణాలు శివలింగాన్ని తాకుతాయని తెలిపారు. ఆలయానికి ప్రత్యేకమైన విశిష్టత ఉందని, 11వ శతాబ్దంలో చోళ రాజులు నిర్మించారని చెప్పారు. శివాలయాన్ని అప్పటిలో ఆదిశంకరాచార్యులు కూడా సందర్శించారని వెల్లడించారు. బ్రహ్మసూత్రం కలిగిన గొప్ప శివాలయంగా కూడా పేరు పొందిందని వివరించారు. జిల్లాలో బ్రహ్మసూత్రం కలిగిన ఆలయం ఇది ఒక్కటేనని వివరించారు. ఆలయంలో రెండు నందులు ఉండటం విశేషమన్నారు. ఒకటి స్థిర నంది, మరొకటి చర నందిగా పిలుస్తారని తెలిపారు. స్త్రీలు ప్రసవ సమయంలో ఇబ్బందులు కలిగినప్పుడు చర నందిని తిరోగమనంలోకి తిప్పితే సుఖ ప్రసవం జరుగుతుందని పూర్వీకులు చెప్పేవారని ఆయన వివరించారు.



శివలింగాన్ని తాకిన కిరణాలు

వరల్డ్ బాడీబిల్డింగ్‌లో రవికుమార్‌కు బంగారు పతకం



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఈనెల 9 నుంచి 11 వరకు థాయిలాండ్‌లోని పటాయ్‌లో నిర్వహించిన వరల్డ్ బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్‌లో నిశ్శంకరరావు రవికుమార్ బంగారు పతకం గెలుపొందాడు. సోమవారం 70 కేజీల విభాగంలో జరిగిన ఫైనల్స్‌లో అత్యుత్తమ ప్రదర్శనకు గాను ఈ ఘనత సాధించాడు. మొత్తం 56 దేశాల నుంచి సుమారు 450 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. గుంటూరు శివారు ఏటుకూరుకు చెందిన రవి కుమార్ పేద కుటుంబం నుంచి వచ్చారు. గతంలో ఆయన మిస్టర్ ఆంధ్ర, మిస్టర్ ఇండియా, మిస్టర్ ఏషియా పోటీల్లో అనేక పతకాలు సాధించారు. రవి కుమార్ టెలిఫోన్‌లో 'సాక్షి'తో మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి ఎంతో ప్రోత్సహించారన్నారు. ఆయన అర్జాస్ స్టీల్స్ ఎండీ శ్రీధర్ క్రిష్ణమూర్తి చేత తనకు ఆర్థిక చేయూతనందించారని చెప్పారు.

క్లుప్తంగా

స్క్రీనింగ్‌తో ప్రాథమిక దశలోనే క్యాన్సర్ గుర్తింపు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు



నరసరావుపేట: క్యాన్సర్ స్క్రీనింగ్ వలన ప్రాథమిక దశలోనే వ్యాధిని గుర్తించి, నివారించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సందర్భంగా స్క్రీనింగ్‌కు సంబంధించిన పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవి కార్యక్రమం ప్రాధాన్యత వివరించారు. అంగన్వాడీ, స్కూలు పిల్లలకు సైతం ఈ స్క్రీనింగ్ టెస్టులు జరుగుతాయని పేర్కొన్నారు. జిల్లా విద్యాశాఖ, ఐసీడీఎస్, వైద్యఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ కుస్తీ పోటీలకు కేబీఆర్ విద్యార్థి

నరసరావుపేట ఈస్ట్: జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు కేబీఆర్ కళాశాల విద్యార్థి ఎం.ధర్మానాయక్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్‌వి నాగిరెడ్డి సోమవారం తెలిపారు. అనంతపురం జిల్లా కళ్యాణదుర్గంలో ఈనెల 9,10వ తేదీలలో నిర్వహించిన సీనియర్ అమెచ్యూర్ రెజ్లింగ్(కుస్తీ) చాంపియన్ షిప్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు ఎం.ధర్మానాయక్ బంగారు పతకం, ఎం.ధయాకర్, ఎం.మహేష్‌లు వెండి పతకాలు సాధించినట్టు తెలిపారు. వీరిలో ధర్మానాయక్ డిసెంబర్ 9,10తేదీలలో కర్ణాటకలో నిర్వహించనున్న జాతీయ స్థాయి కుస్తీ పోటీలకు ఎంపికైనట్టు వివరించారు. కళాశాల కార్యదర్శి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, ప్రిన్సిపల్ నాగిరెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటశివ, పీడీ ఎం.వినీల్, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో కౌలు రైతు మృతి

చిలకలూరిపేటటౌన్: గుర్తు తెలియని వాహనం ఢీకొని కౌలు రైతు మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని గోపాళంవారిపాలెం గ్రామానికి చెందిన కంభంపాటి సుకుమార్(23) గ్రామం పరిధిలో కొంత భూమిని ఈ ఏడాది కౌలుకు తీసుకుని పత్తి సాగు చేశాడు. ఈ నేపథ్యంలో పంటలో తెగుళ్ల వ్యాపించడంతో చిలకలూరిపేట పట్టణానికి వచ్చి పురుగుమందులు తీసుకుని తిరిగి గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా పోతవరం వద్ద గ్రానైట్ ఫ్యాక్టరీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తలకు తీవ్రగాయాలైన సుకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అవివాహితుడైన సుకుమార్ తండ్రి ఆదిబాబు కూడా గతరెండు నెలల కిందటే అనారోగ్యంతో చనిపోయాడు. సుకుమార్ తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ హ్యాక్.. రూ.11.47లక్షలు డ్రా

- పోలీసు గ్రీవెన్స్‌లో బాధితుడు ఫిర్యాదు
- 51 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట: సెల్‌ఫోన్‌ను హ్యాక్ చేసి తన బ్యాంకు ఖాతా నుంచి రూ.11.47లక్షలను డ్రా చేశారని ఓ వ్యక్తి జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) పాల్గొని ప్రజల నుంచి కుటుంబ, ఆర్థిక, ఆస్తి, చోరీలు, మోసాలు, తగాదాలు ఆయా సమస్యలకు సంబంధించి 51 ఫిర్యాదులను ఎస్పీ స్వీకరించారు. వచ్చిన అర్జీలపై శ్రద్ధ వహించి నిర్ణీత గడువు లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో బాధితుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు

ఆస్తి రాయించుకొని గెంటేశారు

నాకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె. నాకు ఐదెకరాలకుపైగా పొలం ఉండగా ఇద్దరు కుమారులకు రెండుఎకరాల చొప్పున రాసిచ్చాను. మిగిలిన పొలం నావద్దే ఉంచుకున్నా. పిల్లలకు వివాహం చేయటం వలన కొంత అప్పు అయింది. ఆ అప్పు తీర్చేందుకు పొలం విక్రయించేందుకు కుమారులు ఒప్పుకోకపోగా అప్పు ఎందుకు చేశావంటూ నాపై దాడిచేసి అన్నం పెట్టకుండా ఇంటి నుంచి గెంటి వేశారు. నాకు న్యాయం చేయండి.

– ఏటుకూరి నాగయ్య, మతుకుమల్లి, శావల్యాపురం మండలం

హ్యాక్‌చేసి డబ్బులు డ్రా చేశారు

నాకు పట్టణంలోని అరండల్ పేట కరూర్ వైశ్యా బ్యాంకులో ఖాతా ఉంది. అందులో రూ.13.22లక్షల నగదు ఉంది. ఈనెల 4వ తేదీన బ్యాంకుకు వెళ్లి ఖాతాలో ఉన్న నగదు డ్రా చేసేందుకు ప్రయత్నించగా సర్వర్ డౌన్ అయిందని, కొద్దిసేపు ఆగి రావాలని బ్యాంకు సిబ్బంది కోరారు. కొద్దిసేపు ఆగి వెళ్లగా నా ఖాతాలో కేవలం రూ.1.75లక్షలు మాత్రమే ఉన్నాయి. మిగతా రూ.11.47లక్షల గురించి ప్రశ్నించగా.. పరిశీలించిన బ్యాంకు సిబ్బంది సెల్‌ఫోన్‌ను హ్యాక్‌చేసి ఖాతాలోని డబ్బును గుర్తుతెలియని వ్యక్తులు డ్రా చేశారని చెప్పారు. వెంటనే 1930కు ఫిర్యాదుచేయటంతో నా ఖాతాను నిలుపుదల చేశారు. నాకు తెలియకుండా డ్రాచేసిన నగదు ప్రిన్స్ కుమార్‌సింగ్ అనే వ్యక్తి ఖాతాలో ఉన్నట్లు గుర్తించారు. దీనిపై రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాను, ఇప్పటివరకు పరిష్కారం లభించలేదు. నన్ను మోసంచేసిన వారిపై చర్యలు తీసుకొని నా డబ్బులు నాకు ఇప్పించండి.



– ఉన్నవ రాంబాబు, కేసానుపల్లి, నరసరావుపేట మండలం

సివిల్ కేసులో పోలీసుల వేధింపులు

నేను 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసి నివాసం ఉంటున్న స్థలం ఆదే గ్రామానికి చెందిన బి.సాంబశివరావు తనదని తొమ్మిదేళ్ల క్రితం కోర్టుకు వెళ్లాడు. కోర్టులో ప్రస్తుతం క్రాస్ ఎగ్జామినేషన్ స్థితిలో ఉండగా సాంబశివరావు తన రాజకీయ పలుకుబడి ఉపయోగించి అమరావతి ఎస్‌ఐ రాజశేఖర్ ద్వారా నన్ను నాలుగురోజుల నుంచి స్టేషన్‌కు పిలిపించి ఇల్లు ఖాళీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారు. దీంతో పాటు బి.సాంబశివరావు నన్ను చంపుతానని బెదిరిస్తున్నాడు. వ్యవసాయం చేసుకునే నేను పోలీసుస్టేషన్ చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నా. నాకు సాంబశివరావు నుంచి ప్రాణ హాని ఉంది. మీరే రక్షించాలి.

– జొన్నకూటి అన్నప్రసాదు, మండపూడి, అమరావతి మండలం

డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు

నాలుగేళ్ల క్రితం ఎలక్ట్రికల్ స్మార్ట్ మీటర్ల సబ్ కాంట్రాక్ట్ కోసం చాగంటి కృష్ణ అనే వ్యక్తి ద్వారా మద్దపాటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఖాతాకు రూ.10లక్షలు, నరసరావుపేట పట్టణంలోని నవయుగ ఫ్యామిలీ రెస్టారెంట్‌కు మరో రూ.13లక్షలతో కలిపి మొత్తం రూ.23లక్షలు చెల్లించాను. సదరు వ్యక్తులు సబ్ కాంట్రాక్టు ఇవ్వకపోగా తీసుకున్న డబ్బులు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారు. నా డబ్బులు ఇప్పించి న్యాయం చేయండి.

– ఉప్పుటూరి వెంకటరావు, జొన్నలగడ్డ గ్రామం, నరసరావుపేట

మోసం చేసి రిజిస్టర్ చేయించుకున్నారు

రెండేళ్ల క్రితం మనవరాలి వైద్య అవసరాల కోసం గ్రామంలో రూ.10లక్షలు విలువైన నాకున్న రెండు సెంట్ల స్థలాన్ని రాజశేఖర్ అనే వ్యక్తికి తాకట్టు పెట్టి రూ.2ల వడ్డీపై రూ.2లక్షలు తీసుకున్నా. వరుసగా నాలుగు నెలలపాటు నెలకు రూ.6వేలు చొప్పున వడ్డీ చెల్లించా. తాకట్టు రిజిస్ట్రేషన్ చేయించాలంటూ నన్ను రిజిస్ట్రార్ కార్యాలయానికి పిలిపించి చదువురాని నన్ను మోసంచేసి స్వాధీనపు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. నన్ను మోసం చేసిన వారిపై చర్యలు తీసుకొని నా స్థలం నాకు ఇప్పించండి.

– పాటిబండ్ల సుబ్బాయమ్మ, సాతులూరు, నాదెండ్ల మండలం

నిధులు ఇప్పిస్తామంటూ మోసం

నేను కేరళకు చెందినవాడిని. మాచర్ల ఆత్మకూరు అడ్డరోడ్డు వద్ద సెయింట్ మార్టిన్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ నడుపుతున్నా. బాలకృష్ణ అనే వ్యక్తి ఎంపీ ల్యాడ్స్ నుంచి స్కూలుకు స్కాలర్‌షిప్ ఇప్పిస్తానని మాయమాటలు చెప్పి నా వద్ద నుంచి రూ.7.36 లక్షలు తీసుకున్నాడు. చేస్తానన్న పని చేయలేదు. డబ్బులు తిరిగి ఇవ్వలేదు. అతనిపై చర్యలు తీసుకొని నా డబ్బులు ఇప్పించండి.

– తంగాచేన్ వలయతే, మాచర్ల

త్రికోటేశ్వర జలప్రసాదం ప్రారంభం

- కోటప్పకొండపై రూ.35లక్షలతో రెండు ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటుచేసిన దివీస్ సంస్థ
- ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ



నరసరావుపేట రూరల్: హైదరాబాద్ దివీస్ ల్యాబోరేటరీస్ సంస్థ జలప్రసాదం స్కీమ్‌లో భాగంగా కోటప్పకొండలో ఏర్పాటుచేసిన రెండు ఆర్వో ప్లాంట్‌లను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ దివీస్ సంస్థ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జలప్రసాదం స్కీమ్ పేరులో 121 ఆర్వో ప్లాంట్‌లను ఏర్పాటు చేశారని, త్రికోటేశ్వర స్వామి ఆలయంలో రూ.35లక్షలతో రెండు ప్లాంట్‌లను అందుబాటులోకి తీసుకువచ్చారని తెలిపారు. భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా శుద్ధజలాలను ఈ ప్లాంట్‌ల ద్వారా సరఫరా చేస్తారని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ త్రికోటేశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ డి.చంద్రశేఖరరావు, దివీస్ సంస్థ ప్రతినిధులు జి.నగేష్, సిహెచ్ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ కడియం కోటి సుబ్బారావులు పాల్గొన్నారు.

46,099 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 46,099 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 43,750 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది.

30 నుంచి తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పోటీలు

కారెంపూడి: పల్నాటి వీరారాధన ఉత్సవాల సందర్భంగా పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో రెండు తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బల ప్రదర్శన (బండ లాగుడు) పోటీలను ఏర్పాటు చేసినట్లు కారెంపూడి రైతు సంఘం తెలిపింది. స్థానిక పోలేరమ్మ తల్లి ఆలయంలో పోటీల పోస్టర్లను సోమవారం రాత్రి ఆవిష్కరించారు. ఉత్సవాల ప్రారంభ తేదీ ఈ నెల 30వ తేదీ నుంచి నవంబరు 4వ తేదీ వరకు ఐదు విభాగాలలో ఐదు రోజులు పోటీలను నిర్వహించనున్నట్లు ప్రతి విభాగంలో కూడా ఆరు నగదు బహుమతులతో పాటు షీల్డ్‌లను ప్రకటించారు. 30వ తేదీ ఆరు పళ్ల విభాగంలో పోటీలు జరుగుతాయి. ప్రథమ బహుమతి రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.20 వేలు మిగిలిన నాలుగు బహుమతులు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు, రూ.7 వేలుగా ప్రకటించారు. ఒకటో తేదీ సేద్యం విభాగంలో పోటీలు జరుగుతాయని, ప్రథమ బహుమతి రూ.30 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలు. అలాగే 2వ తేదీ సబ్ జూనియర్ పోటీలు జరుగుతాయి. ప్రథమ బహుమతి రూ.35 వేలు, ద్వితీయ బహుమతి రూ. 25 వేలు. 3వ తేదీ జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయి. ప్రథమ బహుమతి రూ.40 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు. నాలుగవ తేదీ సీనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని, ప్రథమ బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ.50 వేలు, తృతీయ బహుమతి రూ.40 వేలు, నాలుగవ బహుమతి రూ.30 వేలు, ఐదవ బహుమతి రూ.20 వేలు, ఆరవ బహుమతి రూ.10 వేలను ప్రకటించారు. వివరాలకు సెల్ 9948619245, 9949274642, 888615309 నంబర్లను సంప్రదించాలని కోరారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో జరగనున్న పోటీల ప్రారంభోత్సవాలకు డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కల్యాణ్‌తో పాటు జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలు, నాయకులను ఆహ్వానించినట్లు రైతు సంఘం పేర్కొంది.



ఎడ్ల పోటీల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రైతు సంఘం సభ్యులు

దేవాలయాల పరిరక్షణకు హిందువులంతా ఏకం కావాలి

విద్యాభారతి ప్రాంత కార్యదర్శి జిగురు ప్రతాపసింహ శాస్త్రి

సత్తెనపల్లి: దేవాలయాల పరిరక్షణకు హిందువులంతా ఏకం కావాలని విద్యాభారతి ప్రాంత కార్యదర్శి జిగురు ప్రతాపసింహ శాస్త్రి పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ విశ్వహిందూ పరిషత్ పిలుపు మేరకు హిందూ దేవాలయ పరిరక్షణ కోసం 2025 జనవరి 5న విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావం కార్యక్రమానికి సంబంధించి సోమవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా హాజరై మాట్లాడారు. హిందూ ఆలయాల వ్యవస్థను రక్షించుకునేందుకు హిందువులంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి గ్రామం నుంచి హిందువులు పెద్ద సంఖ్యలో విజయవాడ హైందవ శంఖారావానికి తరలి రావాలని కోరారు. ఇందుకు సంబంధించి ముందుగా గ్రామాల స్థాయిలో ఏర్పాటు చేయవలసిన సమావేశాలు, సన్నాహక నిర్ణయాలు వివరించారు. పల్నాడు జిల్లా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ బాధ్యులు తిప్పిరెడ్డి జయనేందర్ రెడ్డి, విశ్వహిందూ పరిషత్ బాధ్యులు డాక్టర్ పమిడిమళ్ళ మహేశ్వర్‌రెడ్డి, నరసింహగిరిస్వామి, బదరినారాయణలు మాట్లాడారు. హిందూ దేవాలయాల పరిరక్షణకు సంబంధించిన కరపత్రాలను నరసింహగిరిస్వామి ఆవిష్కరించారు. సన్నాహక సమావేశంలో బాధ్యులు చలువాది చినసత్యనారాయణ, అబ్బూరి సత్యనారాయణ, తొమ్మండ్రు సత్యనారాయణ, దేవరశెట్టి రవికుమార్, శంకర్, బ్రాహ్మణ ఐక్యవేదిక నాయకులు, ఆర్యవైశ్య సంఘ నాయకులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు, బీజేపీ నాయకులు, పలు దేవాలయాల నిర్వాహకులు, వినాయక మంటపాల నిర్వాహకులు పాల్గొన్నారు.



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నరసింహగిరి స్వామి, ప్రతాపసింహ శాస్త్రి తదితరులు

యార్డుల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

నరసరావుపేట: సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను మార్కెట్ యార్డుల్లోనే ఏర్పాటుచేయాలని ఏపీ రైతు సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల వేదికలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు పత్తి ముఖ్యమైన వాణిజ్య పంట అన్నారు. గులాబీ రంగు పురుగు వలన దిగుబడి ఎకరాకు నాలుగైదు క్వింటాళ్ల తగ్గిందన్నారు. గతంలో ఎకరాకు పది నుంచి 15క్వింటాలు పత్తి లభించేది అన్నారు. పండిన కొద్దిపాటి పత్తిని కొనేవారు లేక తేమ సాకు చూపుతుండటంతో క్వింటా కేవలం రూ.5వేలకే ప్రైవేటు వ్యాపారులకు విక్రయిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.7521ఎక్కడా అమలుకావట్లేదన్నారు. ప్రైవేటు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కేంద్రాలు తెరుస్తున్నట్లుగా తమకు సమాచారం ఉందన్నారు. ఆ మిల్లుల్లో రైతుల మాటకు విలువ ఉండదన్నారు. కౌలు రైతులకు గ్రామ సచివాలయాల ద్వారా ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి నేరుగా వారి నుంచే కొనుగోలు చేయాలని కోరారు. దళారుల ప్రవేశాన్ని నిరోధించాలన్నారు. నాణ్యతా ప్రమాణాలను వాస్తవ ప్రాతిపదికన సడలించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు గద్దె చలమయ్య, కామినేని రామారావు పాల్గొన్నారు.

ఆశావర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

- ఉద్యోగ విరమణ వయసు పెంపు, బీమా, ఇతరత్రా బెనిఫిట్ల జీఓలు విడుదల చేయండి
- డీఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేసిన సీఐటీయూ నాయకులు



నరసరావుపేట: గత ప్రభుత్వంలో ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర ప్రతినిధి వర్గంతో నిర్వహించిన చర్చల్లో కుదిరిన ఒప్పందం మేరకు ప్రస్తుత ప్రభుత్వం జీఓలు, సర్క్యులర్లు వెంటనే విడుదల చేయాలని ఆ యూనియన్ నాయకులు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రవిని కోరారు. ఈ మేరకు నాయకులు డి.శివకుమారి, సిలార్ మసూద్ సోమవారం వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. చర్చలు ముగిసి తొమ్మిది నెలలు కావొస్తున్నా జీఓలు విడుదల కాకపోవటంపై ఆశావర్కర్లు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈమధ్య కాలంలో అనేకమంది ఆశావర్కర్లు ఉద్యోగ విరమణ చేశారని, మిగిలిన వారు 60ఏళ్ల నుంచి 62ఏళ్లకు పెంపుదలపై జీఓ రాకపోవటంతో ఆందోళన చెందుతున్నారని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కూడా అందట్లేదన్నారు. ఈ కాలంలో మృతిచెందిన అనేకమంది ఆశావర్కర్లకు బీమా సౌకర్యం కూడా లభించలేదన్నారు. దీంతో పాటు సెల్‌ఫోన్‌లు పనిచేయకపోవటంతో ఆశా వర్కర్లు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఒక గంట పర్మిషన్, ఒకరోజు సెలవు కోసం అధికారుల దయాదాక్షిణ్యాలపై ఆధార పడాల్సివస్తుందని, సెలవు కావాలంటే ప్రత్యామ్నాయంగా మరొకరిని సూచించి ఆమెతో ఆ పనిచేయిస్తేనే సెలవుకాని, పర్మిషన్‌కాని లభిస్తుందన్నారు. ఆశావర్కర్ ఒకటి, రెండురోజులు సెలవు తీసుకుంటే తాను వచ్చిన తర్వాత అదేపని చేయాల్సిన పరిస్థితి ఉందన్నారు. నూతన రికార్డులు ఏప్రిల్ ఒకటి నుంచి నిర్వహించాల్సివుండగా ఇప్పటివరకు మంజూరు చేయలేన్నారు. ఒప్పంద జీఓలు విడుదల చేయకుండా ప్రభుత్వం నానా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జీఓలకోసం ఈనెల 18న కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించేందుకు యూనియన్ నిర్ణయించిందని పేర్కొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాపోరు

నరసరావుపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 14వరకు ప్రజాపోరు నిర్వహిస్తున్నట్లు సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్ వెల్లడించారు. సోమవారం ప్రజాపోరు ప్రచార యాత్రలో భాగంగా పట్టణంలోని మల్లమ్మ సెంటర్‌లో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అనుకూలంగా పాలన చేయకుండా కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన చేస్తోందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి కూడా కేంద్రం బాటలో పాలన సాగిస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 7 నుంచి 14 వరకు ప్రజాపోరు నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 14న జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ వద్ద, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. నాయకులు షేక్ సిలార్ మసూద్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

మహానేత వైఎస్సార్ విగ్రహం కళ్లకు గంతలు

చిలకలూరిపేటలో ఘటన

చిలకలూరిపేట: గుర్తు తెలియని వ్యక్తులు దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం కళ్లకు గంతలు కట్టిన అమానుష ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పట్టణంలోని భాస్కర్‌సెంటర్‌లో డాక్టర్ వైఎస్సార్, మాజీ ఎమ్మెల్యే దివంగత సోమేపల్లి సాంబయ్య విగ్రహాలు ఉన్నాయి. సోమవారం ఉదయం డాక్టర్ వైఎస్సార్ విగ్రహం కళ్లకు గంతలు కట్టి ఉండడాన్ని చూసిన ప్రజలు విస్మయానికి గురయ్యారు. సమాచారం అందుకున్న పట్టణ ఎస్‌ఐ డి.చెన్నకేశవులు సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాలను పరిశీలించారు. ఈ విషయాన్ని వివరణ కోరగా తాము విగ్రహాల వద్దకు చేరుకొనే సరికే ఎవరో గంతలు తొలగించారని తెలిపారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు రాత్రి సైతం కొందరు అధికార పార్టీ కార్యకర్తలు ఈ విగ్రహాల వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న క్రమంలో అప్పట్లో పోలీసు పెట్రోలింగ్ వాహనం రావడం అక్కడ సంచరిస్తున్న వారిని తరిమివేయడం జరిగింది. ఈ క్రమంలో ఇలాంటి కవ్వింపు చర్యలకు ఎవరు పాల్పడినా పోలీసులు తగు చర్యలు తీసుకొని భవిష్యత్తులో గొడవలు జరగకుండా నివారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

జాతీయస్థాయి ఫుట్‌బాల్ జట్ల ఎంపిక



ఎంపికైన బాలుర జట్టుతో ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ, పీడీలు



ఎంపికైన బాలికల జట్టు

సత్తెనపల్లి: జాతీయ స్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో జాతీయస్థాయి ఫుట్‌బాల్ జట్టుకు ఎంపికైన బాలబాలికలలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ గుంటూరు, ప్రగతి జూనియర్ కళాశాల సత్తెనపల్లి ఆధ్వర్యంలో ఈ నెల 8 నుంచి 10వ తేదీవరకు నిర్వహించిన 68వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జాతీయస్థాయి జట్లకు ఎంపిక చేశారు. జాతీయస్థాయి పోటీల్లో తలపడే 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ జట్టుని గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి జి.నరసింహారావు, టోర్నమెంట్ పరిశీలకులు డాక్టర్ పి.ప్రభాకర్ సోమవారం ప్రకటించారు. బాలుర జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా సి.టి.కార్ (తూర్పుగోదావరి), రూత్ మేరీ (వైఎస్సార్ కడప) బి.అనీల్ దత్త నాయక్ (గుంటూరు) వ్యవహరించారు. బాలికల జట్టు ఎంపిక కమిటీ సభ్యులుగా నారాయణరావు (తూర్పుగోదావరి), లాకు పిచ్చయ్య (గుంటూరు), టి.ప్రకాష్ రెడ్డి (అనంతపురం) వ్యవహరించారు. ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్‌లో మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రాతినిధ్యం వహించనున్నారు.

బాలుర జట్టు: జె.మోజేష్ రాజు, ఎం.ముఖేష్, వి.విల్ స్మిత్, ఎ.స్టాలిన్ (గుంటూరు), వి.శర్వంత్, బి.మన్యూష్ సాయి చంద్ర, సి.హెచ్.వి.దుర్గాప్రసాద్, సి.హెచ్.సందీప్ (విశాఖపట్నం), కె.జయంత్, వి.అభిరామ్ రాజు, బి.ఈశ్వర్ (కర్నూలు), కె.సాయి మోక్షజ్ఞ, ఎస్.జోయల్ (ప్రకాశం), ఎ.చైతన్య, పి.మనోజ్ కుమార్(విజయనగరం), జి.నవదీప్ (వైఎస్సార్ కడప),పి.రిషి తేజ (అనంతపురం), ఎ.అబ్దుల్ మజీద్ (చిత్తూరు), స్టాండ్ బైలుగా బి.ఈశ్వర్(అనంతపురం), పి.సంగీత్ (కృష్ణా), పి.కుమార్ (తూర్పుగోదావరి)లు ఎంపికయ్యారు.

బాలికల జట్టు: బి.అనూష, ఎస్.ఆర్.యష్మశ్రీ, ఈ. లిఖిత, జి.కీర్తన (అనంతపురం), టి.అరుణ, ఎస్.దీపిక, కె.అంజనా దేవి(వైఎస్సార్ కడప), ఎం.పవిత్ర భావని, టి.యామిని, ఎల్.శివదుర్గ, బి.అఖిల(గుంటూరు), ఎస్.రేష్మ, జి.హేమహాసిని (విశాఖ పట్నం), జి.హేమశ్రీ(చిత్తూరు), వై.షైనీ(తూర్పుగోదావరి), పి.భవ్య(పశ్చిమగోదావరి), ఎస్.మహాలక్ష్మి (విజయనగరం), సిహెచ్.పూజిత (ప్రకాశం), స్టాండ్ బైలుగా వి.దీప్తి(తూర్పుగోదావరి), బి.భవాని(పశ్చిమగోదావరి), హెచ్.మధు (అనంతపురం), జె.శ్రీలక్ష్మి (గుంటూరు)లు ఎంపికయ్యారు.

అక్రమ వెంచర్లపై చర్యలు తీసుకోండి

జిల్లా కలెక్టర్‌ను కోరిన ప్రజాసంఘాల నాయకులు

నరసరావుపేట: టౌన్‌షిప్‌ల పేరుతో పలువురు ఆర్ అండ్‌బీ రోడ్లు, ఎన్ఎస్పీ కాలువలు ఆక్రమించి వెంచర్లు వేసి ప్రభుత్వ స్థలాలను చూపించి ప్లాట్లు విక్రయించి సొమ్ము దండుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకొని, రోడ్లు, కాలువలు పునరుద్ధరించాలని ప్రజాసంఘాల నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) రాష్ట్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ మాట్లాడుతూ నరసరావుపేట మండలం ములకలూరు, గోళ్లపాడు గ్రామాల మధ్యలో వేసిన ఓ వెంచర్‌లో ఎన్ఎస్పీ కాలువ, ఆర్‌అండ్‌బీ రోడ్లను ఉపయోగించుకుని గార్డెన్ నిర్మాణం చేశారని అన్నారు. దీనిని చూపించి ప్లాట్లు అమ్మకాలు చేస్తున్నారని, ప్రభుత్వ స్థలాన్ని ఉపయోగించుకొని వ్యాపారం చేస్తున్న నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పీడీఎం రాష్ట్ర నాయకులు వై.వెంకటేశ్వరావు, షేక్ మస్తాన్‌వలి, నల్లపాటి రామారావు, గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోటా నాయక్, పౌర హక్కుల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ శికినం చిన్న, బీసీ సంఘం నాయకులు పాల్గొన్నారు.